క్లుప్తంగా

బార్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి పి.డేవిడ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ కాలపరిమితి ఈనెల 27తో ముగుస్తుండడంతో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి డాక్టర్ పి.డేవిడ్ తెలిపారు. శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 17 నుంచి 23 వరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, మార్చి 21న పరిశీలన, అభ్యర్థుల జాబితా, 22న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఎన్నికల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 1న నూతన కార్యవర్గం బాధ్యతలు చేపడుతుందన్నారు. ఎన్నికల అధికారులుగా వినోద్‌రెడ్డి, ఎండీ అబ్దుల్లాఖాన్‌లు వ్యవహరిస్తారని తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య


ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ ఏగం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఆర్, నలంద కళాశాలల వద్ద ప్రచారం చేపట్టారు. విద్యార్థులకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు నరేశ్, కునాల్, గజానంద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో ఇఫ్తార్


ఖర్జూర తినిపిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

కైలాస్‌నగర్: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్ కాలనీలో శనివారం మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. నాయకులు ఇర్ఫాన్, ముబారక్, ఫరూక్, ఖయ్యూమ్‌రజా, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం


వైద్య శిబిరంలో సిబ్బంది

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ పాఠశాలలో శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్ సింగ్, హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నాల్గొవ రోజుకు ఎమ్మార్పీఎస్ దీక్షలు

కైలాస్‌నగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాల్గొవ రోజుకు చేరాయి. నాయకులు సర్కారు తీరుకు వ్యతిరేకంగా తమ నిరసన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి మాదిగ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు.
బోథ్: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయబద్ధంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ బోథ్ మండల కేంద్రంలో చేస్తున్న నిరసన రిలే దీక్షలు శనివారం నాటికి నాల్గొవ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు బోథ్ మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులు సంఘీభావం ప్రకటించారు. దీక్షల్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, కారెం రవి, బిక్క రమణ, బత్తిని గంగయ్య తదితరులు ఉన్నారు.

బస్‌షెల్టర్లు లేక అవస్థలు

- ఎండకు ఎండుతూ, వానలో తడుస్తూ ఎదురుచూపులు
- నూతనంగా ఏర్పాటు చేయాలని వేడుకోలు


ఇంద్రవెల్లిలో బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

ఇంద్రవెల్లి: ఉట్నూర్ ఆర్టీసీ డిపో పరిధిలోని మండల కేంద్రాల్లో, గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల ద్వారా ఆదాయం పొందుతున్న ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో బస్సులు ఆగే చోట షెల్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండకు ఎండుతూ, వానలో తడుస్తూ ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. కొన్ని చోట్ల చెట్ల నీడలో, వ్యాపార దుకాణ సముదాయాల వద్ద వేచి చూస్తూ అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ బస్సులు ఆగే చోట బస్సు షెల్టర్లు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణికుల తిప్పలు..
ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని ముత్నూర్, దనోరా.బి, ఇన్కార్‌గూడ, శంకర్‌గూడ గ్రామాలతో పాటు ఉట్నూర్ మండలంలోని పులిమడుగు, కుమ్మరితండా, యేంద, శ్యాంపూర్, హస్నాపూర్ తదితర గ్రామాల్లో బస్సు ఆగే స్థలంలో షెల్టర్లు లేక, సౌకర్యాలు లేక వివిధ పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు ప్రతీరోజు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

చెట్టు నీడే దిక్కు..



ధనోరా(బి) గ్రామంతో పాటు సుమారు 10 గ్రామాల ప్రయాణికులు ధనోరా నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. బస్సు షెల్టర్ లేక చెట్టు నీడలో వేచి ఉండి ఇబ్బందులు పడుతున్నాం. ఆర్టీసీ అధికారులు దృష్టి సారించి బస్సుషెల్టర్ ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రతలు తీసుకోవాలి.

– షేక్ షకీల్, ధనోరా(బి)

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

ఉట్నూర్ ఆర్టీసీ డిపో పరిధిలోని పలు స్టాప్‌లలో షెల్టర్‌లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవం. ఇంతకు ముందే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి ఉన్నతాధికారులతో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దృష్టికి తీసుకెళ్లి బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం.

– శకుంతల, డీఎం, ఉట్నూర్ డిపో

రైతు సంక్షేమానికి కృషి చేయాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: నూతనంగా ఎన్నికైన ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మార్కెట్ కమిటీ పాలక వర్గ సభ్యులను సన్మానించారు. అనంతరం మండలంలోని శంకర్‌తాండ నివాసి ఐటీడీఏ ఏపీవో జనరల్ జాదవ్ వసంత్ తండ్రి నారాయణ్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాగా చాందూరి గ్రామ పంచాయతీ పరిధిలోని రాజులగూడ గ్రామానికి చెందిన కుమ్ర రాహుల్ వివాహం ఈనెల 16న జయశ్రీతో నిశ్చయించగా వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తనవంతుగా పెండ్లికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అక్షయ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాట

నేరడిగొండ: తల్లిదండ్రుల ఉత్సాహం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన బాట అని తేజాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మణిలత అన్నారు. శనివారం తేజాపూర్ పాఠశాల, తేజాపూర్ అభివృద్ధికి సమష్టి సహకారం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు భూమారెడ్డి పాఠశాలకు రూ.11వేలు విరాళంగా అందించగా, ఉపాధ్యాయ బృందం మరో రూ.3వేలు అందించి రూ.14వేలతో టీవీని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల గదిలో టీవీని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు పవన్, నిరోష, శ్రీనివాస్ గౌడ్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు పంపిణీ


వంటపాత్రలు అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్, భోరజ్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు శనివారం మధ్యాహ్న భోజనం వంటపాత్రలను ఎంఈవో శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ రెండు మండలాల్లో 64 పాఠశాలలు ఉండగా, 57 పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ చేశామన్నారు. మిగితా ఏడు పాఠశాలలకు త్వరలో వంట పాత్రలు రానున్నట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు లస్మన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, విద్యాశాఖ సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.


ఇచ్చోడలో..

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
ఇచ్చోడ: ప్రభుత్వం పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో కసావత్ బిక్కు అన్నారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాల ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి వచ్చిన వంట పాత్రలను పంపిణీ చేశారు. సీఆర్పీలు సురేశ్, శ్యాంసుందర్, రవీందర్, గంగాభవాని, రాజు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరామ్ జయంతి

ఇంద్రవెల్లి: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరామ్ 91వ జయంతి శనివారం మండలకేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఘనంగా నిర్వహించారు. బహుజన్ సమాజ్ పార్టీ, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేజీబీవీలో 10వ తరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు పెందోర్ అంకుష్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే, దళిత సంఘాల నాయకులు దత్త ఆచారే, వావల్కర్ శివాజీ, కాంబ్లే ఉత్తం, సత్యానంద్, పరత్‌వాగ్ దత్త తదితరులు ఉన్నారు.

ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..
ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలో ధర్మసమాజ్ పార్టీ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారాన్ని సాధించి కాన్షీరాంకు ఘనమైన నివాళులర్పిస్తామని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు రాజేశ్వర్, ఎంజేఎస్ నేత అన్నెల అడెల్లు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో కాన్షీరాం 91వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు లక్ష్మణ్, ప్రశాంత్, సాయికుమార్, గోవర్ధన్, మధు పాల్గొన్నారు.
బోథ్: బోథ్, సోనాల మండలాల్లో కాన్షీరాం జయంతిని ఘనంగా నిర్వహించారు. బోథ్ మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీంతో పాటు ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, రమేశ్, స్వామి, ఆటో యూనియన్ నాయకులు సాఫీర్, రాజు, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌రూరల్: కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు


ఇంద్రవెల్లి: పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఎస్పీని కలిసిన ఆడే గజేందర్


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలోని పలు విషయాలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, కుర్మే మహేందర్, జాదవ్ కపిల్, బద్దం పోతారెడ్డి, ఎండీ సద్దాం తదితరులు ఉన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి..
నేరడిగొండ: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని వైదూర్యపురం (వదూర్) గ్రామంలో క్రికెట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి విజేత వదూర్ జట్టుకు రూ.21వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ముఖర జట్టుకు రూ.11వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నేరడిగొండ జట్టుకు రూ. 5వేల చొప్పున నగదుతో పాటు షీల్డులు అందజేశారు.

హక్కులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం

ఆదిలాబాద్‌టౌన్: వినియోగదారులు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. వైస్‌ప్రిన్సిపాల్ రఘు, సౌజన్య, కార్తిక్, నరేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న భోజరెడ్డి

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామంలో శనివారం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి ఉపాధిహామీ పథకం నిధులతో మంజూరైన రూ.5లక్షల సీసీరోడ్డు, మురికి కాలువల పనులు ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, బాబన్న, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకన్న యాదవ్, దుస నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ బోధన ప్రారంభం


దేవపూర్‌లో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్

తలమడుగు: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ప్రతీ విద్యార్థి నేర్చుకోవాలని ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, డీఈవో ప్రణీత అన్నారు. మండలంలోని దేవపూర్, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖోడద్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) విద్యను బోధించే ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్‌రావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, ప్రత్యూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సిరికొండ: వేసవి కాలంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా తెలంగాణ సంస్కృతి సారథి కళాకారుల బృందం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని కోసుపటేల్ గూడలో శనివారం జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాబృందం గ్రామంలో ప్రజలకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలు, వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన చికిత్సపై అవగాహన కల్పించారు. కళాకారులు చాగటి రవి, రమేశ్ గుంజాల పాల్గొన్నారు.

నేడు బుద్ధవిగ్రహం ప్రతిష్ఠాపన

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుద్ధవిహార్‌లో ఆదివారం బుద్ధవిగ్రహం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుద్ధిస్ట్ నాయకులు సోన్‌కాంబ్లె కృష్ణకుమార్, కిల్లరే అరుణ్, నర్వడే రమేశ్, ధమ్మపాల్‌లు కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. బుద్ధవిహార్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బుద్ధవిగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందన్నారు. విగ్రహప్రతిష్ఠాపన అనంతరం అంబేద్కర్ మనువడు భీంరావుయశ్వంత్‌రావు ముఖ్యఅతిథిగా రానున్నట్లు తెలిపారు.

శనగ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


శనగ కొనుగోళ్లను ప్రారంభిస్తున్న సాబ్లే కిశోర్ సింగ్

నేరడిగొండ: శనగ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిశోర్ సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు చైర్మన్ కిశోర్ సింగ్ మార్క్‌ఫెడ్ అధికారులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తేదీల వారీగా శనగ కొనుగోళ్లు చేపడుతామన్నారు. శనగ క్వింటాలు ధర రూ.5,650 ఉందని పేర్కొన్నారు. బోథ్ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆడె వసంత్‌రావు, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్‌సింగ్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు సంతోష్ సింగ్, గులాబ్ సింగ్, శ్రీకాంత్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి, పీఏసీఎస్ సీఈవో నాగభూషన్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సద్దాం

నేరడిగొండ: కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని ఓ ఉద్యమంలా చేపట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సద్దాం అన్నారు. శనివారం పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు ఉద్యమంలా చేపట్టాలని సూచించారు. ఇంటింటికి తిరుగుతూ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో హెచ్ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఆయా గ్రామాల ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక


ప్రశాంత్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని అగ్రజా టౌన్‌షిప్‌కు చెందిన మొట్టె లింగమ్మ –నరేంద్రప్రసాద్ దంపతుల రెండో కుమారుడు ప్రశాంత్ కుమార్ ఇటీవల స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (సీజీఎల్–2024) వెల్లడించిన ఫలితాల్లో ట్యాక్స్ అసిస్టెంట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ విభాగంలో కొలువు సాధించాడు. ఇటీవల వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో ఆయన సొదరుడు ప్రసన్నకుమార్ ప్రభుత్వం ఉపాధ్యాయుడిగా ఎంపికై విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా సదరు యువకుడి తండ్రి నరేంద్రప్రసాద్ తలమడుగు మండలం పల్లి –బి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నవేగావ్ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో లక్ష్మణ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవేగావ్‌లో 280 మంది ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా వాటిలో 87 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామంలో భూమిపూజ చేసినట్లు తెలిపారు.